చెరువులకు జలకళ

మేడ్చల్ నియోజకవర్గంలో నిండిన చెరువులు, కుంటలు

మేడ్చల్: నెలల క్రితం వరకు వర్షం కోసం పడిగాపులు గాచిన జనం నేడు వర్షం అగితే చాలు అంటున్నారు. రెండు నెల క్రితం వరకు మేడ్చల్ లో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భారీ వర్షం కురిస్తే చాలు కాస్త ఉపశమనం కలుగుతుందని ఆశపడ్డ జనాలకు గత 20 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బేజారవుతున్నారు.

నిత్యం వర్షం..

15 రోజులుగా మేడ్చల్ ప్రాంతంలో నిత్యం వర్షం కురుస్తుంది. పోద్దంతా మోఘా వృతం కావడం రాత్రైతే చాలు గంటల తరబడి వర్షం పడుతోంది. కొన్ని రోజులు మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటూ సాయంత్రం జోరుగా వర్షం పడింది. నిత్యం వర్షం కురవడంతో ప్రజలు అబ్బా ఇదెక్కడి వర్షం అంటూ నిట్టూర్పువిడుస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి 10గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంటుంది. రహదారులపై ట్రాఫిక్ జామ్, గుంతలలో నీరు ఉండటం, రోడ్లన్నీ జలమయం అవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రెండు నెలల క్రితం దుర్భరం..

రెండు నెలల క్రితం వరకు మేడ్చల్‌లో కరువు విలయ తాండవం చేసింది. మేడ్చల్ అర్బన్ ప్రాంతం కావడంతో వ్యవసాయ సాగు తక్కువగానే ఉంది. ఉన్న కొద్ది భూముల్లో వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు సాధ్యపడలేదు. ప్రదానంగా వర్షాలపై ఆధారపడి సాగు చేసే పంటలపైన మొక్కజొన్న, జొన్న, కంది తదితర ఆరుతడి పంటల సాగు అడ్రస్ లేకుండా పోయింది. పట్టణ ప్రాంతాల్లో వర్షాలు లేక భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో జనం నీటి కోసం అల్లాడిపోయారు. ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి తమ అవసరాలను తీర్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. పట్టణాల్లో, గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో దాదాపు కరువు పరిస్థితి కనిపించింది.



20 రోజులుగా అలుగులు పోస్తున్న మేడ్చల్ పెద్ద చెరువు

నాలుగు నెలలుగా కురిసిన వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో

నెల	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబర్	అక్టోబర్
కురవాల్సిన వర్షం	107.3	165.6	176.4	123	---
కురిన వర్షం	29.5	206	350.4	207.9	200దాదాపు

42 ఏళ్ల తర్వాత నిండిన పోతాయిపల్లి చెరువు..

నెల రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మేడ్చల్ ప్రాంతంలో అన్ని చిన్న, పెద్ద చెరువులు కుంటలు, వాగులు అన్ని పూర్తిగా నీటితో నిండి జలకళ సంతరించుకున్నాయి. శామీర్‌పేట్ మండలంలోని పోతాయిపల్లి గ్రామ చెరువు 42 ఏళ్ల తర్వాత నిండి పొంగిందంటే ఏ మేరకు వర్షం కురుస్తుందో స్పష్టమవుతుంది. నగర శివార్లలో ఉన్న ప్రతి చిన్న పెద్ద చెరువులు, కుంటలు ఎఫ్‌టీఎల్ పరిధి దాటి పూర్తిగా నిండాయి. మేడ్చల్ పెద్ద చెరువులో నీరు అధికమై గత 20 రోజులుగా అలుగులు పోస్తూనే ఉంది.

అధికారులు అలర్ట్ కావాలి..

మేడ్చల్ ప్రాంతంలో ప్రధాన చెరువులన్నీ పూర్తి సామర్థ్యానికి మించి నిండిపోవడంతో అధికారులు అలర్ట్ కావాల్సిన అవసరం ఉంది. చెరువుల కట్టలు, తూములను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తగిన మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.



నిండు కుండలా మేడ్చల్ పెద్ద చెరువు

అగ్ని ప్రమాదాల నియంత్రణపై మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మేడ్చల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అగ్ని మాపక దళ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. విద్యార్థులు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలా ప్రవర్తించాలి వంటి అంశాలపై అవగాహన కలిపించారు. అగ్ని మాపక సిబ్బంది ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో ఎలా స్పందిస్తారో మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారులు విద్యార్థులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఓయో' ఏర్పాటుపై స్థానికుల ఫిర్యాదు

పోచారం: నిబంధనలకు విరుద్ధంగా ఓయో (లాడ్జి) ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు బుధవారం పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌తో పాటు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సంస్కృతి టౌన్‌షిప్ సమీపంలోని భగత్‌నగర్ కాలనీలో రెసిడెన్షియల్ అనుమతి తీసుకుని నిర్మించిన భవనాన్ని వాణిజ్య కార్యకలాపాలను కొనసాగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎల్‌యూ, ట్రేడ్ లైసెన్స్, పోలీస్ ఎన్‌ఓసీ, ఫైర్ సేఫ్టీ, హెల్త్ సర్టిఫికేట్ లేకుండా ఓయూ సంస్థ అతిథులకు గదులు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తుల రాకపోకలు పెరగడం , భద్రత సమస్యలు తలెత్తుతుండటంతో మహిళలు, పిల్లలు అటుగా వెళ్లాలంటే భయపడుతున్నారన్నారు. తమ ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని ఓయోను మూసివేయాలని కోరారు.

టీజీబీసీఎల్ డిపోలో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి అద్దాలను అందజేస్తున్న అధికారులు

మేడ్చల్: నగర శివార్లలోని మేడ్చల్ జిల్లా టీజీబీసీఎల్ డిపోలో బుధవారం సిబ్బందికి ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. మేడ్చల్ లిక్కర్ డిపోలో పని చేసే బేవరేజెస్ ఉద్యోగులు, సిబ్బంది, హమాలీలు, డ్రైవర్లకు పేర్నాడ్ రికార్డ్ ఇండియా విజన్ స్ప్రింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. శిబిరంలో లిక్కర్ డిపో మేనేజర్ కాశీనాథ్,అధికారులు మురళి, శ్రావన్‌కుమార్, నరిధి, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శివకుమార్

జవహర్‌నగర్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జవహర్‌నగర్ కార్పొరేషన్ బీజేఆర్ నగర్‌లో నివసించే శివకుమార్ (32), ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ నెల 22న బయటికి వెళ్లిన శివకుమార్ తిరిగిరాలేదు.అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్ మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ కళాశాలకు వృద్ధురాలి మృతదేహాన్ని ఆమె కుటుంబసభ్యులు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా, కొయ్యలగూడెంకు చెందిన బిత్ర రత్నం(77) తాను మరణించిన తర్వాత తన మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అందజేయాలని కోరింది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబీకులు ఆమె చివరి కోరిక మేరకు మృతదేహాన్ని సీఎంఆర్ మెడికల్ కళాశాలకు అప్పగించారు.

కొంపల్లిలో హెట్టిచ్ స్టోర్...

సాక్షి, సిటీబ్యూరో: ఫర్నిచర్, ఇంటీరియర్ ఉత్పత్తులకు పేరొందిన హెట్టిచ్ ఇండియా నగరంలో తొలి హెట్టిచ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను కొంపల్లిలో ఏర్పాటు చేసింది. దీనిని బుధవారం ప్రారంభించిన సందర్భంగా సేల్స్ డైరెక్టర్ రాహుల్ ఠక్కర్ మాట్లాడుతూ తమ జర్మన్ ఫర్నిచర్ ఫిట్టింగ్‌లు, ఆర్కిటెక్చరల్ డోర్ హార్డ్‌వేర్, ఫర్నిచర్ లైటింగ్, కిచెన్ యాక్సెసరీస్..నగరవాసులను ఆకట్టుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మల్లారెడ్డి కళాశాలలో విశేష్ 2 కె 25



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: కృత్రిమ మేధను వినియోగించి మానవాళికి ఉపయోగపడే సాధనాలను తయారు చేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే, మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ మల్లారెడ్డి అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు అంతర్ కళాశాలల ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు సాంకేతికత, అవకాశాలను అందిపుచ్చుకుని సరైన నైపుణ్యాలతో శిక్షణ పొంది ఎంచుకున్న రంగాల్లో సత్తా చాటాలని కోరారు. అనంతరం ప్రాజెక్ట్ ఎక్స్‌పోను సందర్శించి విద్యార్థుల ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీరా డైనమిక్స్ సంస్థ సీఈఓ శ్రీసాయి తేజ, ఎంఆర్‌డీ వీసీ రవీందర్‌రెడ్డి, రిజిస్ట్రార్ శ్రీనివాస్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీన్ ఉదయభాస్కర్, కోఆర్డినేటర్లు మణికంఠ దేవరాజన్, చంద్రమౌళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి



సబ్ రిజిస్ట్రార్ కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని సర్వే నంబర్ 145 లో గల ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని మండల సీపీఎం అధ్యక్షుడు నరేష్ అధికారులను కోరారు.ఈ మేరకు ఆయన బుధవారం సీపీఎం నాయకులతో కలిసి తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ లకు వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 145 ను బ్లాక్ చేసి అందులో రిజిస్ట్రేషన్లు జరగకుండా చూడాలని కోరారు. కొందరు వ్యక్తులు సదరు స్థలాన్ని కబ్జా చేసి పేదలకు అమ్మే యత్నాలు చేస్తున్నారని దోపిడీని అడ్డుకోవాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పూజ, కోమురయ్య, నర్సింగ్‌రావు, రమేష్ తదితరులు ఉన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్‌లో బుధవారం ఆర్‌బీఎల్ బ్యాంక్ ప్రశాసన్ నగర్ బ్రాంచి, ధన్వంతరితో కలిసి సంయుక్తంగా పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ఆర్‌బిఎల్ బ్యాంక్ ప్రశాసన్ శాఖ, ధన్వంతరి నిర్వాహకులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలను మున్ముందు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుశీల తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాన్ని సందర్శించిన తమిళనాడు రైతులు



వివరాలు తెలుసుకుంటున్న తమిళనాడు రైతులు

శామీర్‌పేట్: తమిళనాడు రాష్ట్ర సహకార సంఘాల సభ్యులు, సహకార శాఖ అధికారులు, వ్యవసాయ సహకార సంఘ బృందాలు బుధవారం మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట వ్యవసాయదారుల సేవా సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం లావాదేవీలతో పాటు అభివృద్ధిపై శామీర్‌పేట సంఘం చైర్మన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డి వారికి వివరించారు. శామీర్‌పేట సహకారం సంఘం ద్వారా రైతులకు అందుతున్న ప్రయోజనాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ అధికారులు గోపీనాథ్ , ప్రసాద్ , శ్యామ్‌కుమార్, వైస్ చైర్మన్ ఐలయ్య, డైరెక్టర్లు భూమిరెడ్డి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

అహ్మద్‌గూడలో కార్డన్ సెర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న డీసీపీ పద్మజారెడ్డి

కీసర: కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని అహ్మద్‌గూడ, వీకర్ సెక్షన్ కాలనీలో బుధవారం సాయంత్రం మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 58 వాహనాలను సీజ్‌చేయడంతో పాటు, నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ అహ్మద్‌గూడ వీకర్ సెక్షన్‌కాలనీలో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు నివసిస్తున్నారని, పోలీసుల శాఖ ఆధ్వర్యంలో కార్డన్ ఆండ్ నిర్వహించి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకట్‌రెడ్డి, కీసర సి.ఐ ఆంజనేయులు , ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణం పూర్తి చేయండి

కమిషనర్‌కు ఎంపీ ఈటల ఆదేశాలు

మేడ్చల్: మేడ్చల్ నుంచి గిర్మాపూర్‌కు వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు గ్రంథాలయం వరకు అసంపూర్తిగా ఉండటంతో వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎంపీ ఈటల బుధవారం మేడ్చల్‌లో పర్యటిస్తుండగా రోడ్డు సమస్యను , ఇటీవల రోడ్డు సమస్యపై 'సాక్షి' ప్రచురించిన కథనాన్ని బీజేపీ నాయకుడు రాఘవరెడ్డి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ వెంటనే మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించి గిర్మాపూర్‌కు బస్సులు వెళ్లేలా చూడాలని ఆదేశించారు.

విద్యార్థిని ఆత్మహత్య కేసులో నిందితుడి రిమాండ్

ఘట్‌కేసర్: విద్యార్థిని ఆత్మహత్య కేసులో నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా, నేరెడుచెర్లకు చెందిన కొడమగుండ్ల విక్రమ్ అలియాస్ విక్కీ డిప్లమా చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన విద్యార్థినిని అతను కొన్నాళ్లుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ విషయమై నేరెడుచెర్ల పీఎస్‌లో గత ఏడాది కేసు నమోదు చేశారు. అయినా అతను తన వైఖరి మార్చుకోకుండా ఆమెను వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు ఈ నెల 19న హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.



అన్నపూర్ణ దేవిగా గడి మైసమ్మ అమ్మవారు

సామాన్యులకు భారం తగ్గింది



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

మేడ్చల్: ప్రధాని మోదీ జీఎస్టీ పన్నులను తగ్గించడంతో సామాన్యులకు భారం తగ్గిందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆయన బుధవారం బీజేపీ నాయకులతో కలిసి మేడ్చల్‌లో పలు దుకాణాలకు వెళ్లి దుకాణాల యజమానులు, వినియోగదారులతో ముచ్చటించారు. మార్కెట్ లోని పలు దుకాణాల వద్దకు వెళ్ళి జీఎస్టీ తగ్గింపు పై ఏ వస్తువుపై ఎంత ప్రయోజనం చేకూరింది తదితర వివరాలను ,యజమానుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు విక్రంరెడ్డి. శైలజ, ప్రభాకర్‌రెడ్డి, ప్రేందాస్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సనాతన జీవన్ ట్రస్ట్‌తో 'మెడిసిటీ' ఎంఓయూ



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కల్పన

మేడ్చల్‌రూరల్: ఘనాపూర్‌లోని మెడిసిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కాలేజీ సనాతన జీవన్ ట్రస్ట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఇరు సంస్థల ప్రతినిధులు ఎంఓయూ పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మెడిసిటి ప్రెసిడెంట్ ప్రొఫెసర్ శివరామకృష్ణ మాట్లాడుతూ వైద్య పరిశోధనతో పాటు ఆధునిక అల్లోపతి వైద్యాన్ని అందించడంలో తమ అనుభవాన్ని సనాతన జీవన్ ట్రస్టు వారికి సాంప్రదాయ వైద్యాన్ని అందించడంలో ఉన్న అనుభవాన్ని మేళవించి సంపూర్ణమైన ఆరోగ్య విధానాలను రూపొందించడానికి కలిసి పని చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్,వైస్ ప్రిన్సిపాల్, జీవన్ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

మెడిసిటి వైద్యురాలికి ఘాయి బండారి అవార్డు.....

మెడిసిటి మెడికల్ సైన్సెస్ గైనకాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ కల్పనకు డాక్టర్ ఎస్‌కే ఘాయి బండారి అవార్డు దక్కింది. అబ్ స్ట్రిక్స్, గైనకాలజీలో వ్యాధి నివారణ అనే అంశంలో భాగంగా గ్రామీణ ప్రాంత మహిళల్లో గర్భాశయ కేన్సర్‌ను గుర్తించడానికి అవసరమైన పాప్ స్మియర్ పరీక్ష కోసం ఇంటి వద్దనే స్వాబ్ సాంపిల్ తీసుకోవడం, ఆమోదయోగ్యత సాధ్యాసాధ్యాలపై చేసిన పరిశోధనకు గాను 38వ ఏఐసీసీ(ఆల్ ఇండియా కో ఆర్డినేషన్ కమిటీ), ఆర్‌సీఓడీ(రాయల్ కాలేజ్ ఆఫ్ ఆబ్ స్ట్రీషియన్స్, గైనకాలజిస్టు) వార్షిక సదస్సులో డాక్టర్ కల్పనకు అవార్డు ప్రదానం చేశారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు సెయింట్ పీటర్స్ విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు నేహనిస్కా, హరిని జాతీయ స్థాయి 35 వ జూనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక కాగా ఈ నెల 25 నుంచి 27 వరకు బెంగళూరులో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు. ఈ మేరకు కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, పీడీ వెంకటనారాయణ విద్యార్థినులను అభినందించారు.

ఆల్‌ఫోర్స్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలతో ఆల్‌ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అధ్యాపకులు, విద్యార్థినులు

ఘట్‌కేసర్: అవుషాపూర్ ఆల్‌ఫోర్స్ ఐఐటీ నీట్ అకాడమీలో బతుకమ్మ సంబురాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గునుగు, తంగేడి, బంతి, చామంతి పూలతో అందంగా బతుకమ్మలు తయారు చేశారు. కార్యక్రమానికి ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నవదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ బతుకమ్మ ప్రకృతిని ఆరాధించే పండుగని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను అందరికీ తెలియజేసేందుకు వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం మహిళా అధ్యాపకులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ, కోలాటాలు ఆడారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: బతుకమ్మ ప్రకృతి పండుగని, ప్రకృతిలో దొరికే గునుగు , తంగేడు పూలు , రుద్రాక్షాలు, బంతి, చామంతి తీరొక్క పూలతో తీరు తీరు బతుకమ్మలను పేర్చి అవే పూలను నీటిలో వేసే ప్రకృతి పండుగని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బతుకమ్మ పర్యావరణాన్ని కాపాడే పండుగన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ పండుగ ఉంటుందన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంగరంగ వైభవంగా నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఎస్‌సీడీఎల్ సూపరింటెండెంట్ మాలతి, వివిధ మండలాల తహశీల్దార్లు ,కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. బతుకమ్మ కార్యక్రమాన్ని జిల్లా తహసీల్దార్ల యూనియన్ ప్రతినిధులు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు ఆట, పాటలు, నృత్యాలతో సందడి చేశారు.

అన్నపూర్ణా నమోస్తుతే...

మేడ్చల్: మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల పరిధిలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో మూడవ రోజైన బుధవారం అమ్మవారిని గడిమైసమ్మ ఆలయంలో అన్నపూర్ణ దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఎంపీ ఈటల పూజలు..

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ గడిమైసమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్‌టీసీ కాలనీ కట్టమైసమ్మ ఆలయంలో నిర్వహించిన నవరాత్రి పూజలలో పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఈటల